దేశాన్ని కాపాడుదాం...రాష్ట్రాన్ని రక్షిద్దాం

సీపీఐ అల్లూరి జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ

విశాలాంధ్ర - జీకే వీధి: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైకాపా ప్రభుత్వాల నుండి దేశాన్ని కాపాడుకుని రాష్ట్రాన్ని రక్షించుకుందామని సీపీఐ అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఏబులం గ్రామంలో ఆ పార్టీ మండల కార్యదర్శి సత్తిబాబు ఆధ్వర్యంలో సోమవారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించి మాట్లాడారు. మణిపూర్‌లో మహిళలపై జరిగిన సంఘటన యావత్ భారతదేశ మహిళలను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిని తక్షణమే ఉరితీయాలన్నారు. మణిపూర్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదే క్రమంలో మణిపూర్ లో కుక్కి గిరిజనులకు శాంతి నెలకొలపాలని, ఈ దేశ ఆదివాసీ గిరిజనులను రక్షించాలని అన్నారు. ఈనెల 20వ తేదీన దేశాన్ని కాపాడుకుందాం... రాష్ట్రాన్ని రక్షించుకుందాం అనే నినాదంతో ప్రజా సమస్యలపై సీపీఐ బస్సు యాత్ర నర్సీపట్నం మీదగా చింతపల్లి రానుందని, ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు వంతల టిష్ బాబు, రాజు బాబు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ మారణ హోమానికి బీజేపీయే కారణం: సీపీఐ

విశాలాంధ్ర - మధురవాడ: మణిపూర్‌లో రెండు తెగుల ప్రజల మధ్య మారణ హోమం సృష్టించి, మహిళలను వివస్త్రలుగా చేసి ఊరేగింపు చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో కొమ్మాది కూడలిలో కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మధురవాడ ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, జిల్లా సమితి సభ్యురాలు ఎండి బేగంలు మాట్లాడుతూ బాధితుల్లో విశ్వాసం కల్పించే చర్యలు చేపట్టాలని, తక్షణమే ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ రాజీనామా చేయాలని, ఉన్నతాధికార సంస్థ లేదా సుప్రీంకోర్టు అజమాయిషీలో విచారణ జరిపించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు తిరుమలరావు, వెంకటరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: మణిపూర్ రాష్ట్రంలో జరిగిన ఘటనలో పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామనాయుడు అన్నారు. సోమవారం గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో మణిపూర్ ఘటనపై నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వంలో ఉన్న పెద్దలు నేటికీ స్పందించకపోవడం చాలా దారుణమన్నారు. వీటిపై వైసీపీ, టీడీపీ, జనసేన కూడా నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి పి.లోవరాజు, సీపీఐ కార్యవర్గ సభ్యులు గురుబాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు జి.రాధాకృష్ణ, కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్ ఎన్నికకు నామినేషన్లు స్వీకరణ

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: వార్డ్ మెంబర్ ఎన్నికకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిని (ఎంపీడీవో) ఉషారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ సర్పంచ్ వార్డు మెంబర్ల ఎన్నిక జరగని స్థానాల్లో ఎన్నిక నిర్వహణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో దుంబ్రిగూడ మండలంలోని కొల్లాపుట్ పంచాయతీలోని రెండవ వార్డ్ మెంబర్‌కు (మహిళా రిజర్వేషన్) ఈనెల 8 నుండి 10వ తేదీ వరకు అభ్యర్థులు నామినేషన్లు సమర్పించాలన్నారు.

వేతన బకాయిలు చెల్లించండి

విశాలాంధ్ర - కె.కోటపాడు: మండలంలోని వివిధ గ్రామాలలో పని చేస్తున్న పంచాయతీ కార్మికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎంపీడీవో కాంద్రేగుల శచిదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు, సీఐటీయూ పంచాయతీ కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు గాడి ప్రసాదు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు వర్షాకాలంలో రైన్ కోట్లు బూట్లు ఇవ్వాలని, పంచాయతీ కార్మికులు మృతిచెందినట్లయితే దహన సంస్కారాలకు రూ.10,000 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు సీతారాం, దుర్గారావు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణతో తల్లీబిడ్డకు ఆరోగ్యం

విశాలాంధ్ర - పరవాడ: వైఎస్సార్ సంపూర్ణ పోషణతో తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వైఎస్ఆర్ సంపూర్ణ పోషక పథకం కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రక్తహీనత, పోషక లోపం లేని పిల్లలు ఎదుగుదలే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. అనంతరం గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పైలా సన్యాసిరావు, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళ కమిషన్ మెంబెర్ గెడ్డం ఉమ, వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామరావు, ఎంపీడీఓ హేమ సుందరరావు, తహసిల్దార్ కనకరావు, ఈవోఆర్డీ పద్మజ, సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, ఐసీడీఎస్ పీవో లలిత కుమారి, నాయకులు, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పెందుర్తి, గాజువాక సెక్టర్ వారి ఆధ్వర్యంలో జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో గల వడ్లపూడి దుగ్గపువానిపాలెం, కణితి, వడ్లపూడి, అప్పికొండ, ఈర్ల వానిపాలెంలో గర్భిణీలకు, బాలిం తలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. వార్డు కార్పొరేటర్ బొండా జగన్, వార్డు ఇన్ చార్జ్ కోమటి శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శి ప్రగడ వేణుబాబు, జిల్లా కార్యదర్శి బొడ్డ గోవిందా, ముద్దపు దామోదర్, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి దుగ్గపు దానప్పలు, చిత్రాడ వెంకటరమణ, సోషల్ గాజువాక సోషల్ మీడియా కన్వీనర్ బోండా గోవిందరాజులు, ఆదారి శ్రీను, జె.ఈశ్వరరావు, కోమటి రమాదేవి, ప్రగడ గోవిందరాజులు, కాంద్రేగుల కనక పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం నక్కపల్లి అంగన్వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాలు అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం పాల్గొన్నారు. ఈ మేరకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నక్కపల్లి అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ, బాలింతలకు టిహెచ్ఆర్ కిట్లు, ఎఫ్ఆర్‌యస్ యాప్ ద్వారా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు వీసం రామకృష్ణ మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణను గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీసం రామకృష్ణ, సర్పంచ్ నేతల జయరత్న కుమారి, ఉప సర్పంచ్ వీసం రాజు, అల్లాడ కొండబాబు, సూపర్‌వైజర్ కె.లలిత, జయలక్ష్మి, యం.దుర్గ భవానీ, బి.అపర్ణ, వై.లక్ష్మి, కె.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

అప్సా అనుబంధ సంస్థగా జిప్సా

విశాలాంధ్ర - గాజువాక సిటీ: గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) ఆధ్వర్యంలో పాత గాజువాక యశోదా విద్యా నికేతన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిప్సాను రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల సంఘం (అప్సా)తో అనుబంధ సంస్థగా తీర్చిదిద్దడం జరిగింది. జిల్లా, రాష్ట్ర వ్యాప్త సమస్యలపై జిప్సా యొక్క అభిప్రాయాలు కూడా ఆయా వేదికలపై వినిపించేందుకు వీలుగా అందరి సభ్యుల ఏకాభిప్రాయంతో ప్రముఖ రాష్ట్ర సంఘం అయిన (అప్సా)తో అనుబంధం చేస్తున్నట్లు జిప్సా అధ్యక్షుడు భాస్కరరావు తెలిపారు. అప్సా రాష్ట్ర చైర్మన్ వి.సుందరరాం మాట్లాడుస్తరో రాష్ట్ర వ్యాప్తంగా సంఘాన్ని బలోపేతం చేయడంలో భాగంగా ఈ అనుబంధాన్ని చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్సా రాష్ట్ర కార్యదర్శి యం.జనార్దన్, విశాఖ జిల్లా అధ్యక్షుడు జె.సోమశేఖర్, విజయనగరం అధ్యక్షుడు సింహాచలం, మిగిలిన ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు, జిప్సా కార్యదర్శి బి.శ్రీనివాస్, కోశాధికారి డి.శ్రీనివాస్, జగ్గారావు, శోభన్ బాబు తదితరులు సుమారు 70 మంది వివిధ పాఠశాలల కరెస్పాండెంట్స్ పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.70 కోట్లు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి హుండీ లెక్కింపు సోమవారం జరిగింది. రూ.1,70,55, 730/- కోట్లు, బంగారం 0-112-005 మిల్లీ గ్రాము లు, వెండి 10 కేజీల 050 గ్రాములు, 34 రోజులకు గాను భక్తులు హుండీలో ముడుపులు, మొక్కుబడులు కానుకలుగా సమర్పిoచినట్లు ఇన్‌చార్జ్ ఈఓ వి.త్రినాథరావు, డి.సి, డి.ఈఓ సుజాత, ఈఈ శ్రీనివాసరాజు తెలిపారు.

ఎర్ర అప్పారావును డిప్యూటీ సీఎం పరామర్శ

విశాలాంధ్ర - వి.మాడుగుల: అనకాపల్లి జిల్లా చీడికాడకు చెందిన ఎర్ర అప్పారావు అనారోగ్య కారణాల వల్ల విశాఖపట్నం కేజీహెచ్‌లో వైద్య సేవలు పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఉప ముఖ్య మంత్రి బూడి ముత్యాలనాయుడు ఎర్ర అప్పారావును పరామర్శించి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కాగా అప్పారావు అనకాపల్లి జిల్లా వైసీపీ పార్టీ రైతు విభాగం అధ్యక్షులుగా సేవలు అందిస్తున్నారు.

చేనేత కార్మికులకు కలెక్టర్ సత్కారం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతుందని జిల్లా కలెక్టర్ డా ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం కాకానినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు కొనపల చిన బాబు, పద్మ నాభం మండలానికి చెందిన నక్కిన భోగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పద్మ, డెవలప్ మెంట్ ఆఫీసర్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుల సంతృప్తిస్థాయిని పెంచాలి

కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే దరఖాస్తులు, ఫిర్యాదులను వేగంగా పరిష్కరిస్తూ అర్జీదారులు సంతృప్తి పడే విధంగా సమాధానాలు ఇవ్వాలని జిల్లా

కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. స్పందన కార్యక్రమానికి 327 అర్జీలు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, జిల్లా రెవిన్యూ అధికారి పి.వెంకటరమణ, డ్వామా పిడి ఈ. సందీప్ అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సుజనకోటలో ఫ్యామిలీ డాక్టర్

విశాలాంధ్ర - ముంచినపుట్టు: మండల పరిధిలో గల సుజన కోట పంచాయతీ కేంద్రంలో సోమవారం కిలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి లేవలేని స్థితిలో ఉన్నటువంటి రోగులకు వైద్య సేవలు అందిం చారు. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న 92 మందికి వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా పలు రకాల వైద్య పరీక్షలు, 67 రకాల మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులు ప్రబలే అవకాశముం దన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కే.సుబ్రహ్మణ్యం, హెల్త్ అసిస్టెంట్ జె.అశోక్, ఏఎన్ఎంలు ఎస్.పుణ్యవతి, లలిత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జీఓ నెం.21 రద్దు చేయాలి

విశాలాంధ్ర - విశాఖ: కేంద్రంలో నరేంద్ర మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రమాదాల నివారణ పేరుతో తెచ్చిన జీఓ నెంబర్ 21 ఆటో, మోటార్ రంగ కార్మికుల పీకకు ఉరి తగిలించే విధంగా ఉందని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు షేక్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి సిహెచ్.కాసుబాబు విమర్శించారు. జి.వి.ఎం.సి. గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జీఓ నెంబర్ 21ని రద్దు చేయాలని, పెట్రోలు, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తేవాలని, ఆటో కార్మికులకు ఉచిత ఇన్సూరెన్స్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఆగస్టు 12, 13 తేదీలలో ఏఐటీయూసీ జిల్లా మహాసభల్లో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చర్చించనున్నట్లు తెలిపారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా తీసుకురావడం, ప్రభుత్వ రంగ పరిశ్రమలను కారు చౌకుగా బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టడం, విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 12, 13 తేదీల్లో జరిగే జిల్లా మహాసభల్లో చర్చించి భవిష్యత్తు కార్యా చరణను రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.రమణ, సి హెచ్.ఎర్రయ్య, గోపి, కె.వెంకటి, రాజు, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర - మల్కాపురం: ఏఐటీయూసీ 13వ జిల్లా మహాసభలు ఈనెల 12, 13 తేదీల్లో జరుగుతున్నాయని జయప్రదం చేయాలని విశాఖ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం హెచ్.పి.సి.ఎల్ రఫ్ గేట్ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బీజేపీ వ్యతిరేక విధానాల వలన కార్మికులు నష్టపోతున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేయడానికి మోడీ ప్రభుత్వం పని చేస్తుందని విమర్శించారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు 70% ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సత్తిబాబు కెంగువ అచ్యుత్‌రావు, అజయ్, అప్పాల రెడ్డి, తిరుపతి, చిరంజీవి, శివా, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

సెంటర్ లైటింగ్‌తో కూడిన డబుల్ రోడ్డు వేయాలి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షురాలు అనిత

విశాలాంధ్ర - పాయకరావుపేట: పాయకరావుపేటలో మెయిన్‌రోడ్డు సెంటర్ లైటింగ్ కూడిన డబుల్ రోడ్డు వేసేందుకు ప్రభుత్వం, ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గతంలో మెయిన్‌రోడ్డు విస్తరించేందుకు విడుదలైన నిధులు వెనక్కు వెళ్లాయని గుర్తు చేశారు. ప్రస్తుతం రూ.1.95 కోట్లతో ఉన్న రోడ్డుపై రోడ్డు వేసేందుకు ఎమ్మెల్యే, అధికారులు సిద్ధమవుతున్నారని తెలిపారు. రోడ్డు వేసేందుకు తాము వ్యతిరేకం కాదని, ఉన్న రోడ్డుపై రోడ్డు వేస్తే మరలా రోడ్డు విస్తరించేందుకు టెక్నికల్‌గా 5ఏళ్ల వరకు కుదరదని తెలిపారు. సింగిల్ రోడ్డు వేయటం వలన పాయకరావుపేట ప్రజల సెంటర్ లైటింగ్‌తో కూడిన డబుల్ రోడ్డు కల నెరవేరదన్నారు. ఉన్న రోడ్డులో నాలుగు ప్రదేశాల్లో మాత్రమే ఎక్కువగా రోడ్డు పాడైందని తెలిపారు. రోడ్డు పాడయిన ప్రదేశాల్లో సుమారు రూ.50లక్షలు నిధులు తీసుకొచ్చి మరమ్మతు పనులు చేయించాలని, అనంతరం పూర్తి స్థాయిలో సెంటర్ లైటింగ్‌తో కూడిన డబుల్ రోడ్డు వేసేందుకు వీఎమ్మార్డీఏకి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షులు పెదిరెడ్డి శ్రీను, కంకిపాటి వెంకటేశ్వరరావు, మల్లపురెడ్డి రమాకుమారి, బొంది కాశీవిశ్వనాద్, చిక్కాల శ్రీను, పెదిరెడ్డి నాగవెంకట రమణ, వల్లా విలియంకేరి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు పరిశీలన పక్కాగా చేయాలి

మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్

విశాలాంధ్ర - అరకులోయ: ఓటరు పరిశీలన పక్కాగా చేయాలని మాజీ మంత్రి, టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. అక్షయ ఇన్ ప్రైవేటు రిసార్ట్‌లో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలకు ఓటరు పరిశీలనపై ఆయన దిశా నిర్దేశం చేశారు. ఓటరు పరిశీలనను వేగవంతం చేయాలని, కొత్త ఓటర్లను చేర్పించేల చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు సివేరి దొన్నుదొర మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్ సివేరి అబ్రహం, అరకు పార్లమెంట్ కొశాధికారి వంతాల నాగేశ్వరరావు, అరకు, దుంబ్రిగుడ, అనంతగిరి మండల అధ్యక్షులు శెట్టి బాబురావు, తుడుము సుబ్బారావు, అంటిపర్తి బుజ్జిబాబు, కిలో బలరాం, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి బాకూరు వెంకటరమణ, రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజర్ సెక్రటరీ సాగర సుబ్బారావు, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజర్ సెక్రటరీ కిల్లో సాయిరామ్, మాజీ వైస్ ఎంపీపీ పొద్దు అమ్మన్న, అరకు పార్లమెంట్ టీఎన్‌టీయూసీ అధ్యక్షులు మండ్యాగురు స్వామి, అరకు మాజీ సర్పంచ్ చటరీ వెంకటరావు, అరకు పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నరంజి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ సొంత నిధులతో స్టేషనరీ పంపిణీ

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: ముంచింగిపుట్టు పంచాయతీ పరిధిలో గల అన్ని పాఠశాలల్లో తమ సొంత నిధులతో పాఠశాలల్లో పిల్లలకు పలకలు, పెన్నులు, అట్టలు పంపిణీ చేసినట్టు జర్రెల పంచాయతీ సర్పంచ్ బోర్గం భాగ్యవతి అన్నారు. సోమవారం మండలంలో గల కిలగాడ పంచాయతీ పరిధిలోని ఎంపీయూపీ చెరువుపాకల పాఠశాలలో 34 మందికి, పడల్‌పుట్ గిరిజన సంక్షేమ పాఠశాలలో 33, కొత్తూరు బయలు పాఠశాలలో 21 మంది విద్యార్థులకు స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాగ్యవతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని ప్రతి విద్యార్థులు అందరూ బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు వెళ్లాలన్నారు. తన భర్త వైసీపీ నేత ఎస్.సురేష్, అన్నబోర్గం పూర్ణరావులు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఓ పక్క రాజకీయంలో బిజీగా ఉంటూనే ఇలాంటి సేవ కార్యక్రమాలు చేయడం తనకు ఎంతో సంతృప్తినిస్తుందని సర్పంచ్ భాగవతి అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు ఎన్.సురేష్ రఘు, పాఠశాల ఉపాధ్యాయులు ఎం.విజయ్ కుమార్, సీఆర్టీ గణేష్ పాల్గొన్నారు.

ధర్నాకు దిగిన పారిశుధ్య కార్మికుల అరెస్ట్

విశాలాంధ్ర - పద్మనాభం: తమ హక్కుల కోసం ధర్నా చేస్తున్న జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు 38 మందిని సోమవారం అరెస్ట్ చేశారు. స్థానిక సీఐ సన్యాసినాయుడు వచ్చిన కార్మికులకు పేరుపేరునా ఫోటోలు తీయడంతో కార్మికులు నిరాకరించారు. గ్రూపుగా ఫోటో తీసుకోవాలని కార్మికులు ఆయన్ని కోరారు. ఈ అరెస్టు చేసిన వాళ్లలో 36 మంది స్త్రీలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఇప్పుడు ఉన్న వర్కర్లను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ధర్నా చేపడితే కార్మికులను అరెస్ట్ చేయడం తగదన్నారు. కార్యక్రమంలో కె.విజయ, ఎం.మేరీ, లోకాలమ్మ తదితరులు ఉన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జాతీయ చేనేత దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా మొత్తం అనకాపల్లిలో జరిగిన చేనేత దినోత్సవం విశాఖజిల్లా అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా సంఘం తో కలిసి చేనేత

ప్రాముఖ్యతను వివరిస్తూ చేనేత కార్మికులను సన్మానించారు. ఆప్కో ఏడీ, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, అఖిల భారత పద్మశాలి సంఘం విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు వానపల్లి ఈశ్వరరావు, గౌరవ అధ్యక్షులు కోప్పల రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ సూరిశెట్టి సూరిబాబు, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు చిక్కా సత్యన్నారాయణ, కోశాధికారి నేమల అనీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై టీడీపీ గూండాల దాడి తగదు

విశాలాంధ్ర - అనంతగిరి: అన్నమయ్య జిల్లా పుంగనూరులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకి సెక్యూరిటీ ఇవ్వడానికి వచ్చిన పోలీసులపై టీడీపీ గూండాలు దాడి చేయడం తగదని ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం వైసీపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ నీలవేణి, పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్ మాట్లాడుతూ పోలీసులపై టీడీపీ గూండాలను రెచ్చ గొట్టిన చంద్రబాబు వైఖరి దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సారా సీతయ్య, కొర్రా సింహాద్రి, సాలేపు పెంటమ్మ, సిరగం గణేష్, కురడబోయిన రాములమ్మ, వైసీపీ నాయకులు దూరియా సత్యనారాయణ, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస: చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు

నాయుడు చేపడుతున్న యాత్రకు రూట్ మ్యాప్ పర్మిషన్ లేకుండా యాత్ర చేస్తూ పోలీసులపై దాడి చేయడం తగదని వైసీపీ నాయకులు అన్నారు. టీడీపీ కుటిల నీచ రాజకీయాలకు నిరసనగా భీమిలి నియోజకవర్గం వైసీపీ శ్రేణులు తగరపువలస అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించి చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి సరైన రీతిలో బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో ఆనందపురం మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యం, జీవీఎంసీ 1వ వార్డు ప్రెసిడెంట్ జగ్గుపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ పథకానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో తిమ్మాపురం గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకానికి పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. పథకంలో భాగంగా

ఇంటింటికీ కుళాయిల పైపులైన్లు నిర్మాణం కోసం సుమారు 88 లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, మండల వైసీపీ కన్వీనర్ కొణతాల శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు మాతా గురునాథరావు, అల్లాడ నాగరాజు, రామచంద్రరాజు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేట భూ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

కలెక్టరేట్ ముట్టడిలో జనసేన డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లాలోని కశింకోట మండలం బయ్యవరం రెవిన్యూ పరిధిలో విస్సన్నపేట గ్రామం సర్వే నెంబర్ 195/2లో 609.24 ఎకరాల విస్తీర్ణం గల భూమిలో జరుగుతున్న "భూ" అక్రమాలపై సమగ్రమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముట్టిడి జరిగింది. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన అనంతరం అనకాపల్లి పార్లమెంట్ నియోజక వర్గ అధికార ప్రతినిధి దూలం గోపి, పార్లమెంట్ కమిటీ సభ్యులు శ్రీరాందాస్ గోవింద్, మాజీ కౌన్సిలర్ తాడి రామకృష్ణలు మాట్లాడారు. 2020 ఆఖరు నుండి మొదలుకుని ఈ భూ యజ్ఞం నిర్విరామంగా కొనసాగుతున్నా అధికారులు మాత్రం తూ తూ మంత్రంగా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా లేఔట్ నిర్మాణం సాగిస్తున్నారన్నారు. అక్కడ ఉన్న ప్రభుత్వ గెడ్డలను, కొండలను, దళితులకు ఇచ్చిన అసెండ్ భూములను, ఇనం భూములు, డి - పట్ట భూములను, సీలింగ్ ల్యాండ్స్‌ను, ప్రభుత్వ భూములను అక్రమంగా చదును చేసి వాల్టా చట్టాన్ని సైతం అతిక్రమించి వేల సంఖ్యలో చెట్లను అక్రమంగా నరికేసి అక్కడ ఉన్న కొండలను సైతం పిండి చేసి అక్రమ లేఔట్ తయారీకి రంగం సిద్ధం చేసిన పరిస్థితి ఉందన్నారు. సదరు అంశంపై పూర్తి విచారణ చేయమని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌కు 2021లో ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని కూడా ఆర్.డి.ఓ నేతృత్వంలో వేసినట్లు గుర్తు చేశారు. కానీ ఆ విచారణ నివేదిక మాత్రం నేటికీ బహిర్గతం కాలేదన్నారు. అక్కడి పనులు ఆగలేదని, లోకాయుక్త సుమోటివేగా స్వీకరించి విచారణ కొరకు 7 అంశాలపై నలుగురు అధికారులని నియమించినా వారి నివేదిక కూడా నేటికీ అందని పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో మళ్ల శ్రీను, బర్నికాన రాము, గంగుపాం జగదీశ్, అప్పికొండ గణేష్, వీరామహిళ సీత, కరణం నాయుడు, కోన దుర్గ పాల్గొన్నారు.

ఎలిమెంటరీ స్కూల్ నూతన భవనం ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: శిధిలావస్థకు చేరుకున్న వాసుదేవ నగర్ జీవీఎంసీ ఎలిమెంటరీ పాఠశాలను యుద్ధ ప్రాతిపదికన లక్ష్మి నారాయణపురం నూతన భవనంలోకి మార్పు చేస్తుండడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. సోమవారం నూతన స్కూల్ భవనం ప్రారంభ కార్యక్ర మానికి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం, అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావులు హాజరై రిబ్బన్ కట్ చేసి తరగతి గదులను ప్రారంభించారు. సీతారాం మాట్లాడుతూ ఈ భవనం విషయంపై జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, నగర మేయర్ జి.హరి వెంకట కుమారిల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇప్పుడు సమస్య పరిష్కారమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఎక్స్ ఆఫీషియో సభ్యులు సేనాపతి అప్పారావు, జీవీఎంసీ ఉప విద్యా శాఖాధికారి శ్రీనివాసరావు, మండల విద్యా శాఖధికారి 2 బాలామణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, సి.ఆర్.ఎం.టి.వి.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ సభ్యుల మహాధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర - అనంతగిరి: అరుకు నియోజకవర్గం పరిధిలో గల అన్ని మండలాల సర్పంచులు ఏకమై ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ఈనెల 10వ తేదీన పాడేరులో జరిగే భారతీయ జనతా పార్టీ నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని అనంతగిరి భారతీయ జనతా పార్టీ అరకు అసెంబ్లీ కో కన్వీనర్ శెట్టి రాజు అన్నారు. ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రంలోనే స్థానిక సంస్థలకు 6950.5 కోట్లు రూపాయలు విడుదల చేసిందని, ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్లకు తెలియకుండానే దారి మళ్లించిందన్నారు.

2024 సార్వత్రిక ఎన్నికలకు సమాయత్తం కండి

విశాలాంధ్ర - చింతపల్లి: 2024లో జరుగబోవు సార్వత్రిక ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సమాయత్తం కావాలని ఆ పార్టీ పాడేరు నియోజకవర్గం పరిశీలకుడు రాజమండ్రి నారాయణ, నియోజక వర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. అధికార వైకాపా వైఫల్యాలు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. తెదేపా ఎన్నికల మేనిఫెస్టోను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లే విధంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ఓటర్ గుర్తింపు కార్యక్రమంలో అందరూ చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శులు సోమేలి చిట్టిబాబు, గబ్బాడ సింహాచలం అధికార ప్రతినిధి జి.శివ కుమార్, కొట్టగుల్లి రమేష్ నాయుడు, అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి, పార్టీ సీనియర్ నాయకులు చల్లంగి లక్ష్మణరావు, రామ్మూర్తి సమిరెడ్డి నాగబ్బాయి, పాటి బింబాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే పిల్లలకు శ్రేయస్కరం

విశాలాంధ్ర - చీడికాడ: తల్లిపాలు పిల్లలకు శ్రేయస్కరమని ఎంపీపీ కూరచా జయమ్మ అన్నారు. మండలంలోని అప్పలరాజుపురం గ్రామాల సచివాలయ పరిధి అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు తాగుట వలన పిల్లలు ఆరోగ్యంగా ఉంటార న్నారు. అంగన్వాడి సిబ్బంది పిల్లలకు విధిగా పౌష్టికా హారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు చుక్క అప్పలనాయుడు, కోడూరు సత్యవతి, పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, అంగన్వాడి టీచర్లు బండారు ముత్యాలమ్మ, పి.శ్యామలాదేవి, రొంగలి వెంకటలక్ష్మి, ఓ.అరుణ, డివి రామలక్ష్మి, కేడి లక్ష్మి, డి.లీలావతి, ఏఎన్ఎం వాణి, మణి, గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

4 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలో గల నాలుగు గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిందని మండల అభివృద్ధి అధికారి వెంకటరావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో గల నాలుగు గ్రామ పంచాయతీలకు సంబంధించి శోభకోట పంచాయతీలో సర్పంచ్ గాను మతం పంచాయతీలో 1 వార్డ్, బారమోని పంచాయతీలో 3 వార్డ్, ఓల్డా పంచాయతీలో 5 వార్డ్ , మొత్తం 3 వార్డ్ మెంబర్ల గాను ఒకటి సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నా మన్నారు. 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఇచ్చారన్నారు. 11న నామినేషన్ల పరిశీలన, 14న నామినే షన్ల ఉపసంహరణకు అవకాశం ఉందన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత తుది జాబితా ప్రకటిస్తారన్నారు. ఈ నెల 19 ఎన్నికలు నిర్వహించి, అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారని ఆయన తెలిపారు.

గద్దర్ మృతికి నివాళులు

విశాలాంధ్ర - రావికమతం: ప్రజా కవి, విప్లవ గాయకుడు గద్దర్ మరణాన్ని చింతూస్తూ.... కొత్తకోట డా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ విగ్రహం వద్ద పలువురు మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ దళిత, గిరిజన జాతులను తన విప్లవ గేయాలతో మేల్కొపే దిశగా పలు పోరాటాలు చేసారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత, బహుజన నాయకులు మల్లేటి రాజు, అంబేద్కర్ సంఘం సభ్యులు బి. బుల్లిబాబు, పూడి అప్పారావు, టి.శేఖర్, బి.చిరంజీవి, చెక్క నాగు తదితరులు పాల్గొన్నారు.

మృదంగం విద్వాంసులు కేసానపల్లి కన్నుమూత

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం విశ్రాంత నిలయ విద్వాంసులు కేసానపల్లి జ్ఞానానందం (72) సోమవారం ఉదయం కన్ను మూశారు. కుమార్తెకు మందులు విషయమై కేరళ వెళ్లిన ఆయన ఉదయం ఏడు గంటల ప్రాంతంలో గుండె పోటుకు గురై వెంటనే కుప్పకూలి పోయారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. మంగళవారం విశాఖలో అంత్య క్రియలు నిర్వహిస్తారు. ముళ్ళపూడి బాణీ అనుసరించే కేసానపల్లి కడప, విశాఖపట్నం ఆకాశవాణి కేంద్రాలలో 27 ఏళ్ళు నిలయ విద్వాంసునిగా సేవలందించారు. విశాఖపట్నం ఆకాశవాణి కేంద్రం నుండి 2011లో పదవి విరమణ చేశారు.

ఘోర రోడ్డు ప్రమాదం

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ గోపాలపట్నం ఆర్ఆర్ వెంకటాపురం జంక్షన్ వద్ద ఆల్వార్ దాసు కళాశాల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. మృతుడు రాజశేఖర్ (34)గా గుర్తించారు. మృతుడు గౌరీ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ లెక్చలర్‌గా పనిచేస్తున్నారు. సంఘటన స్థలం వద్దకు ట్రాఫిక్ పోలీసులు శ్రీనివాసరావు, సిబ్బంది చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - హుకుంపేట: అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలని మహిళ శిశు సంక్షేమ శాఖ రీజనల్ డైరెక్టర్ చిన్మయి దేవి అన్నారు. మండలంలోని దాలిగుమ్మడి అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో నాణ్యమైన ఆహారాల ను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. గర్భిణీలు, బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకుంటే తల్లితో పాటు బిడ్డ ఆరోగ్యవంతులుగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ కేవెల్ఆర్ కుమారి, సూపరింటెండెంట్ మూర్తి, స్థానిక సీడీపీఓ బాలచంద్ర మణిదేవి, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం కేజె.పురం-1 రైతు భరోసా కేంద్రాన్ని మాడుగుల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వి.చిట్టి నాయుడు ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఇందులో భాగంగా రైతు భరోసా కేంద్రం పరిధిలో గల పశువులకు లంపి స్కిన్ వ్యాధి, ముద్ద చర్మ వ్యాధి రాకుండా టీకాలు వేయాలని సూచించారు. ఈ నెల 31 వరకు ఈ టీకాల కార్యక్రమం జరుగుతుందని పాడి రైతులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు. ఇప్పటివరకు ఎన్ని పశువులకు టీకాలు వేసినది పశు వైద్య సహాయకుడు రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సహాయకుడు రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రోస్టీల్ సమాపక ఉత్సవం

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంలో డక్టైల్ ఐరన్ పైప్స్, ఫిట్టింగ్స్ ఉత్పత్తిలో ప్రముఖ సంస్థ ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్ (ఇసిఎల్), తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి రూరల్, తొండమనాడు గ్రామం, జిల్లా పరిషత్ (జెడ్పి) హైస్కూల్‌లో, 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకూ 257 మంది విద్యార్థులకి జూన్ 2022 నుంచి ఏప్రిల్ 2023 వరకూ కంప్యూటర్ లిటరసీ ప్రోగ్రాములు నిర్వహించింది. ఎలక్ట్రోస్టీల్ శ్రీకాళహస్తి వర్క్స్ తన సిఎస్ఆర్ చర్యల క్రింద ఈ చొరవని చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సంద ర్భంగా, ఇసిఎల్ ఒక సమాపక ఉత్సవాన్ని నిర్వహించి, విద్యార్థులు సాధించిన విజయానికి వారిని సన్మానించింది.

ఈ సందర్భంగా జరిగిన వేడుకలో ఉత్సవ వాతావరణం నెలకొంది. ఎలక్ట్రోస్టీల్ ఈ వేడుకకి తిరుపతి జిల్లా, కమ్యూ నిటీ మొబిలైజేషన్ అధికారి సురేష్‌ని ముఖ్య అతిథిగా ఆహ్వానించింది. విద్యార్థులు వారి ఐటి వృత్తి ప్రయత్నాలని కొనసాగించడానికిగాను వారి పాఠశాలలో కంప్యూటర్ మౌలిక సౌకర్యాలని కూడా ఏర్పాటు చేయడం జరిగింది.

పశువుల అక్రమ రవాణా అరికట్టాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: జాతీయ రహదారి మీదుగా మన రాష్ట్రంతోపాటు, ఇతర రాష్ట్రాల నుండి జరుగుతున్న పశువుల అక్రమ రవాణాను అరికట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు స్పందనలో ఫిర్యాదు చేసినట్లు పీసీసీ డెలిగేట్ జగతా శ్రీనివాస్ తెలిపారు. విలేఖర్లతో మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పశువులను వాహనాల్లో అక్రమ రవాణా చేస్తున్నప్పటికీ సంబందిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పశువుల అక్రమ రవాణా మాఫియాగా మారి రోజుకు పలు వాహనాల్లో వందలాది పశువులను తరలిస్తూ వ్యాపారులు కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారని తెలిపారు. పశువుల అక్రమ రవాణా కొన్నేళ్ల జరిగితే పశువులు అంతరించిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని పశువుల అక్రమ రవాణా అరికట్టాలని స్పందనలో ఫిర్యాదు చేసినట్లు జగతా శ్రీనివాస్ తెలిపారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - డుంబ్రిగుడ: మండలంలో గల కొల్లా పూటు పంచాయతీ బిత్రగండ గ్రామం అంగన్వాడి కేంద్రంలో సోమవారం గర్భిణీలు, బాలింతలకు స్థానిక సర్పంచ్ వి.రామ్మూర్తి చేతుల మీదుగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో గర్భిణీ, బాలింతలకు అందించే పౌష్టిక ఆహారం స్వయంగా వారి ఇంటి వద్దకే చేరాలనే ముఖ్య ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జే.అప్పల మ్మ, వార్డు సభ్యులు బి.సుందర్, ఎస్.రాజు, గ్రామ వాల ంటీర్ బి.సావిత్రి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

విశాలాంధ్ర - మాకవర పాలెం: మాక వరపాలెం మండలం నారాయణ రాజుపేట గ్రామంలో ఏపిసిఎన్ఎఫ్ ఉత్తమ రైతు పీలా అరుణ్‌కుమార్ వరినారు మడిలో ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో నీమాస్త్రం అనే కషాయంను స్ప్రే చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కవిత, సుదర్శన్, అప్పారావు, లోవకుమార్ పాల్గొన్నారు.

వీరానగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు పరిధిలో గల వీరానగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి, ఐద్వా నాయకురాలు అనంతలక్ష్మి, సిఐటియు నాయకులు అప్పలనాయుడు జీవీఎంసీ సూపరింటెండెంట్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బి.రమణి మాట్లాడుతూ గత కొద్ది సంవత్సరాలుగా వీరానగరులో సుమారు 50 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని ఇంటి పన్నులు వేయకపోవడంతో విద్యుత్తు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పిల్లలు చదువులకు ఆటంకం ఏర్పడుతుందని అన్నారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో కాలనీలోకి పాములు వంటి విష పురుగులు వస్తున్నాయని, దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారని తెలిపారు. తక్షణమే మౌలిక సదు పాయాలు కల్పించి అక్కడి ప్రజలను ఆదుకోవాలని కోరారు.

జగనన్నకు చెబుదాం అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీల సత్వర పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం దరఖాస్తుల పరిష్కారంపై ఆయన సమీక్షించి మాట్లాడారు. స్పందనలో వచ్చిన వినతుల పరిష్కారంలో అలక్ష్యం వహించవద్దన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 218 విజ్ఞప్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.యస్.విశ్వనాథన్, డిఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాధాన్యతపై ర్యాలీ

విశాలాంధ్ర - మధురవాడ: తల్లిపాల ప్రాధాన్యతను తెలియజేస్తూ గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్

నర్సింగ్ విద్యార్థుల ఆధ్వర్యంలో స్థానిక రుషికొండ గ్రామంలో అవగాహన ర్యాలీని సోమవారం నిర్వహించారు. ర్యాలీని ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.లక్ష్మమ్మ జెండా ఊపి ప్రారంభిస్తూ తల్లి పాలలో గల పోషక విలువల కారణంగా బిడ్డకు జీవితకాలం ఆరోగ్య రక్షణ అన్నారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్.కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివా, ప్రోగ్రామ్ ఆఫీసర్లు టి.మాలతి, సి.హెచ్.లావణ్య, డి.శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలకు టేక్ హోం రేషన్ కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని పెంటకోట గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వ హించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. టేక్ హెూమ్ రేషన్ కిట్లు పంపిణీ చేశారు. అలాగే రాజవరం పంచాయతీ గజపతినగరం గ్రామంలో, గుంటపల్లి గ్రామంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీలకు టేక్ హెూమ్ రేషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జడ్పీటీసీ లంకా సూర్యనారాయణ, వైసీపీ జిల్లా ప్రచార విభాగం కమిటి అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, మత్స్యకార కార్పోరేషన్ డైరెక్టర్ చోడిపిల్లి శ్రీనివాస్, ఎంపిటిసి కలిదిండి సతీష్, ఇసరపు తాతారావు, రాజేష్‌ఖన్నా, చిక్కాల బాబు, సర్పంచ్‌లు కోడా కోటే శ్వరరావు, పడాల సోమన్నదొర, మేడిశెట్టి రామగోవిందు, వంగలపూడి రామారావు, పన్నీరు బాబ్జి, గెడ్డమూరి శ్రీనివాసరావు, పల్లెల వెంకట్, యజ్జల సత్యనారాయణ, కొంకిపూడి రామకృష్ణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎండి నిషా, సౌజన్య, అంగనవాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

13సెంట్లు స్థలంపై పర్మినెంటు డిక్రీ పొందాను

ఏనుగుపల్లి రాజేశ్వరరావు

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని శ్రీరాంపురం గ్రామానికి చెందిన 12/4 సర్వే నెంబర్‌లో 13 సెంట్ల భూమికి పర్మినెంటు డిక్రీ పొందినట్లు అదే గ్రామానికి చెందిన ఏనుగుపల్లి రాజేశ్వరరావు తెలిపారు. 13సెంట్లు స్థలం గ్రామకంఠం అంటూ పంచాయతీ అధికారులు కోర్టులో కేసు వేశారని, తన వద్ద ఉన్న రికార్డులు కోర్టుకు సమర్పించగా 13 సెంట్లు స్థలం పూర్వార్జితంగా గుర్తిస్తూ తనకు 2016లో పర్మినెంటు డిక్రీ ఇచ్చినట్లు తెలిపారు. అయితే గ్రామానికి చెందిన కొందరు లేని పోని ఆరోపణలు చేస్తు రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. తనకు చెందిన 13సెంట్లు భూమి ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. గ్రామంలోని 5గురు వల్ల తనకు ప్రాణహాని ఉందని రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఏనుగుపల్లి రాజేశ్వరరావు తెలిపారు.

కులధృవీకరణ మంజూరు చేయండి

విశాలాంధ్ర - మాకవరపాలెం: మాకవరపాలెం మండలం పిపి.అగ్రహారం సచివాలయ పరిధిలో కొంత మంది లబ్ధిదారులకు కులధృవీకరణ పత్రాలను ఇవ్వక పోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెల 10న పిపి.అగ్రహారం సచివాలయం వద్ద ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా నారాయణ రాజుపేట గ్రామానికి చెందిన పలువురు బిసి-డి తూర్పు కాపు సర్టిఫికేట్ల కోసం గత నెల 7వ తేదీన దరఖాస్తు చేయగా 10న జగనన్న సురక్ష కార్యక్రమంలో సంబంధిత అధికారులు బిసి-డి సర్టిఫికేట్‌లు నాలుగు రోజుల సమయం పడుతుందని చెప్పారు. దీంతో లబ్ధిదారులు అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎదురు చూసినా సర్టిఫికేట్లు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా సర్టిఫికేట్లను అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

మీషో గణనీయమైన వృద్ధి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: దేశంలోని ప్రముఖ ఈ కామర్స్ మార్కెట్‌ప్లేస్ అయిన మీషో, లాభదాయకంగా మారిన భారతదేశంలో మొట్టమొదటి క్షితిజ సమాంతర ఈ-కామర్స్ కంపెనీగా అవతరించిన చారిత్రాత్మక విజయాన్ని ప్రకటించింది. ఈ మైలురాయి క్షణం భారతీయ ఇ-కామర్స్ ల్యాండ్‌స్కేప్‌లో ట్రయల్‌బ్లేజర్‌గా దాని స్థానాన్ని పటిష్టం చేయడమే కాకుండా మీషో యొక్క వినూత్న వ్యాపార నమూనాకు బలమైన ధృవీకరణగా కూడా పనిచేస్తుందని ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. మీషో జూలై 23 నాటికి ఊహించిన కాలక్రమం కంటే ముందుగానే ఈ పరిశ్రమ-మొదటి ఫీట్‌ను సాధించి ఒదన్నారు. గత 12 నెలల్లో, మీషో అసాధారణమైన వృద్ధిని సాధించింది, ఆర్డర్ వాల్యూమ్‌లు 43 శాతం పెరిగాయని, ఇది ఒక బిలియన్ ఆర్డర్‌లకు చేరుకుందన్నారు.

పరామర్శ కోసం వచ్చి బురద రాజకీయాలు చేసిన సీఎం

విశాలాంధ్ర - చింతూరు: శబరి గోదావరి వరదలు వచ్చి సుమారు వారం గడుస్తున్న తరువాత వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వరద నిర్వాసితుల పరామర్శ కోసం వచ్చి వైసీపీ కార్యకర్తల సమక్షంలో మీకు వరద సాయం అందిందా లేదా అంటే వైసీపీ కార్యకర్తలు కాబట్టి సహాయం అందింది అనే చెబుతారని టీడీపీ నాయకులు ఆరోపించారు. చింతూరు మండలంలో చింతూరు పంచాయతీలో కొన్ని గ్రామాలు రత్నాపురం, పోతనపల్లి ,వేగితోట నిమ్మలగూడెం , చింతూరులో కొన్ని కాలనీలుగా ప్రజలకు వరద సాయం అందలేదని చింతూరు మండల కార్యాలయం ముందు ధర్నా చేసిన మాట వాస్తవం కాదా పీవోకి వేగితోట గ్రామస్తులు వెళ్లి వరద సాయం మాకు అందలేదని ఐటీడీఏ పీవో కి వినతి పత్రం ఇవ్వడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ 10 లక్షలు ఇస్తానన్న హామీ ఏమైందని, పాత భూసేకరణ చట్టం ప్రకారంగా లక్షా 15 వేల రూపాయలు ఇచ్చిన భూములకు ఐదు లక్షలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో చింతూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జిల్లా చిన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లెల వెంకటేశ్వరరావు, మండల మాజీ అధ్యక్షులు ఓబులేని రామారావు చౌదరి, ఉపాధ్యక్షులు పొదిలి రామారావు, ప్రచార కార్యదర్శి కట్టా శంకర్, మండల నాయకులు సల్మాన్ రాజు, మండల ఉపాధ్యక్షులు వాస శ్రీరామ్ మూర్తి రెడ్డి, మీడియం కొండయ్య, కుంజ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెంటకోటలో గడప గడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని పెంటకోట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుండి ఇంకేమైనా పథకాలు అమలు జరగాలా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జడ్పీటీసీ లంకా సూర్యనారాయణ, వైసీపీ జిల్లా ప్రచార కమిటి విభాగం అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, ఎంపీటీసీలు కలిదిండి సతీష్‌రాజు, కొంతం నరేష్, ఇసరపు తాతారావు, జగతా శ్రీను, మత్స్యకార కార్పోరేషన్ డైరక్టర్ చోడివిల్లి శ్రీనివాస్, సర్పంచ్‌లు పడాల సోమన్నదొర, కోడా కోటేశ్వరరావు, మేడిశెట్టి రామగోవిందు, పన్నీరు బాబ్జి, గెద్దమూరి శ్రీనివాసరావు, వంగలపూడి రామారావు, దేవవరపు రాజేష్ ఖన్నా, నీలాపు బాలకృష్ణారెడ్డి, దేవవరపు వెంక టేశ్వరరావు, పల్లెల వెంకట్, యజ్జల సత్యనారాయణ, విరమాళ్ళ రామకృష్ణ, చిక్కాల బాబు, కొంకిపూడి రామ కృష్ణ, ఎంపీడీఓ సాంబశివరావు, తహశీల్దార్ కె.జయ ప్రకాష్, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డి వై.సత్యనారాయణ, వలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలి

విశాలాంధ్ర - మల్కాపురం: చేనేత కార్మికులు తగిన లాభాలలో పయనించి స్వదేశీ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి వి.లక్ష్మీదేవి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో సోమ వారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రారంభోపన్యాసం చేశారు. చేనేత భారత సంస్కృతిలో ఒక భాగం అన్నారు. ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకు చేనేతను ధరించాలని, తద్వారా చేనేతకు డిమాండ్‌ను ఏర్పరచాలని అన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి ప్రసంగించారు. అనంతరం అధ్యాపకులు చేనేత చీరలను ధరించి చేనేతను రక్షిద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయదేవి, అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంజేపీ గురుకులం విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర - నక్కపల్లి: ఈ నెల 4, 5, 6 తేదీల్లో బీకేఎస్ అయ్యంగార్ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ లెవెల్ ఓపెన్ యోగా ఛాంపియన్షిప్ పోటీల్లో నక్కపల్లి మండలం ఉపమాక గ్రామానికి చెందిన దవరసింగి ఆదిత్య రుత్విక్ మూడో స్థానం సాధించాడు. 12 నుంచి 15 ఏళ్ల బాలుర విభాగంలో రుత్విక్ ఈ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో తృతీయ స్థానం సాధించినట్లు సోమవారం ఏపీ స్టేట్ యోగా అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు పుల్లేటి సతీశ్ చెప్పారు. రుత్విక్ నర్సీపట్నం ఎంజేపీ ఏపీ బీసీ డబ్ల్యు రెసిడెన్షియల్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. తమ గురుకులం ప్రిన్సిపాల్ వెంకట రెడ్డి, ఉపాధ్యాయుల సూచనలతో యోగ సాధన చేస్తున్నానని, రానున్న రోజుల్లో జాతీయ స్థాయి పోటీల్లో మొదటి స్థానం సాధించేందుకు మరింత కృషి చేస్తానని ఆదిత్య రుత్విక్ చెప్పాడు.

టేక్ హోమ్ రేషన్ కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - మాకవరపాలెం: మాకవరపాలెం మండలం జెడ్.గంగవరం పంచాయతీ దుంగల వాణిపాలెం అంగన్వాడీ కేంద్రంలో సోమవారం టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా గర్భిణీలు, బాలింతలకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దుంగల వెంకటరమణ మాట్లాడుతూ గర్భవతులు మరియు బాలింతల సౌకర్యార్థం ఇంటికే పోషకాహార కిట్టు పంపిణీ కార్యక్రమంలో భాగంగా పాలు గుడ్లు బియ్యం పప్పులు అనేక పోషకాహారాలతో కూడిన కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త గ్రామస్తులు పాల్గొన్నారు.

గొడ్డేటి మహేష్‌కు తీవ్రగాయాలు

విశాలాంధ్ర - చింతపల్లి: సిపిఐ పార్టీ చింతపల్లి మాజీ శాసనసభ్యుడు గొడ్డేటి దేముడు కుమారుడు, ప్రస్తుత అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి సోదరుడు, అల్లూరి జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్ చింతపల్లి మండలం ఎర్ర బొమ్మల పంచాయితీ కొండ వంచుల గ్రామం నుండి శరబన్నపాలెం వెళుతూ ఈ మధ్య నిర్మించిన ఇరుకైన మలుపు వద్ద ద్విచక్ర వాహనం (స్కూటీ) అదుపుతప్పి ప్రమాదం చోటు చేసుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుని హుటాహుటిన నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య నిమిత్తం విశాఖలోని అపోలో ఆసుపత్రికి తరలించారు.

పలు ప్రాంతాలలో పర్యటించిన జీవీఎంసీ కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ సీ ఎం సాయికాంత్ వర్మ నగరంలోని

పలు ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. సోమవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సీతమ్మధార డిఎల్బి క్వార్టర్స్, ఎన్జీవోస్ కాలనీ, మాధవధార, మురళి నగర్, అంబేద్కర్ కాలనీ, మద్రిపాలెం ఉడా లే-అవుట్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్- 2023 లో విశాఖ నగరానికి మొదటి స్థానం దక్కేందుకు ప్రతి అధికారి చిత్తశుద్ధితో పనిచేయాలని వాకి టాకీ ద్వారా అధికారులను ఆదేశించారు. నగరంలో పలు ప్రాంతాలలో వ్యర్థాలు, చెత్త కుప్పలు అధికంగా ఉన్నాయని ఆయా ప్రాంత శానిటరీ ఇన్స్పెక్టర్లు వాటిని తొలగించాలని ఆదేశించారు. సమయం ఉదయం గం. 7.30 నిమిషాల వరకు మురళినగర్ ప్రధాన రహదారిలో డస్ట్ బిన్ లోని వ్యర్థాలు నిండి ఉండడానికి గమనించి స్థానిక శానిటరీ ఇన్స్పెక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే శుభ్రం చేయాలని ఆదేశించారు. రోడ్డు మార్జిన్లలోనూ, మీడియాలలోనూ వ్యర్థాలు లేకుండా చూడాలని ఉదయం 6 గంటలకే క్లాప్ వాహనాలు, పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో ఉండాలన్నారు. పిన్ పాయింట్ వారీగా పారిశుద్ధ్య కార్మికులను సర్దుబాటు చేసి వ్యర్థాల నిర్వహణలో ఆలసత్వం ప్రదర్శించకుండా ఎప్పటి పని అదే రోజు పూర్తి చేయాలన్నారు.

చేనేత కార్మికులకు ఘన సన్మానం

విశాలాంధ్ర - మాకవరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం మాకవరపాలెం మండలం బయ్యవరం గ్రామంలో మండల విద్యాశాఖ అధికారి పిఎస్ఎన్.మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని చేనేత కార్మికుల ఇళ్లకు వెళ్లి వారిని పలకరించి శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు చేనేత పనిని ఎలా చేస్తారు ? బట్టల్ని ఎలా తయారు చేస్తారు ? ఏ విధంగా నేత నేస్తారు ? అన్న విషయాలను వారిని అడిగి తెలుసుకుని అవగాహన చేసుకున్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు మాట్లాడుతూ ఈరోజు ప్రత్యేకంగా మా ఇండ్లకు వచ్చి మమ్మల్ని గౌరవించినందుకు చాలా ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిఆర్పీ, వెల్ఫేర్ అసిస్టెంట్ భవాని పాల్గొన్నారు.

బ్రాండ్ అంబాసిడర్‌గా దీపికా పదుకొనెను ప్రకటించిన డైసన్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ డైసన్, తన హెయిర్ కేర్ టెక్నాలజీస్ బ్రాండ్ అంబాసిడర్‌గా దీపికా పదుకొణెను ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా, డైసన్ సాంకేతికంగా అధునాతన స్టైలింగ్ సాధనాల ఔచిత్యాన్ని కొనసాగిస్తూనే, శిరోజాల ఆరోగ్యాన్ని కాపాడుకోవలసిన ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచాలని డైసన్ లక్ష్యంగా పెట్టుకుంది. డైసన్ ఇండియాలో మేనేజింగ్ డైరెక్టర్ అంకిత్ జైన్ మాట్లాడుతూ "మేము దీపికా పదుకొనెతో భాగస్వామిగా ఉన్నందుకు సంతోషిస్తున్నామన్నారు. అత్యా ధునిక ఇంజినీరింగ్, ఫార్వర్డ్-థింకింగ్ డిజైన్‌ను కలిపి, డైసన్ హెయిర్ కేర్ టెక్నాలజీలు మన శిరోజాలను సంరక్షించే, స్టైల్ చేసే విధానంలో విప్లవాత్మక మార్పులకు సహకారం అందిస్తాయని అన్నారు.

వలంటీర్లకు సన్మానం

విశాలాంధ్ర - మాకవరపాలెం: మాకవరపాలెం మండలం తామరం గ్రామ సచివాలయంలో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా 14 మంది వలంటీర్లకు సత్కరించి సేవా మిత్ర అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు హరిబాబు, సర్పంచ్ చెల్లారత్నం, వైస్ ఎంపిపి లక్ష్మీ, ఉప సర్పంచ్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బాలదొర, వీఆర్వో నూకరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ గోవింద తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం

జెడ్పీటీసీ కాకర దేవి

విశాలాంధ్ర - యస్.రాయవరం: గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేయడమే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని జెడ్పిటిసి సభ్యురాలు కాకర దేవి అన్నారు. సోమవారం మండలం కేంద్రమైన ఎస్. రాయవరంలో సచివాలయం వద్ద వైయస్సార్ పౌష్టికాహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో ద్వారా ఇచ్చే ఈ సరుకులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా గర్భిణీలకు బాలింతలకు పిల్లలకు ఎంతో ఆరోగ్యకరమైనదని అన్నారు. అనంతరం వచ్చిన గర్భిణీలకు బాలింతలకు కిట్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోన లోవ లక్ష్మి, సర్పంచ్ భూపతి అప్పారావు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి స్థానిక ఎంపిటిసి బొలిశెట్టి గోవిందరావు, మండల వైసీపీ కన్వీనర్ కొణతాల శ్రీనివాసరావు, ఐ సి డి ఎస్ సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్ తర్వాత వైద్య రంగంలో మార్పులు

కలెక్టర్ డా మల్లికార్జున

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కోవిడ్ తర్వాత వైద్యరంగంలో వివిధ దురదృష్టకర సంఘటనలు జరుగుతున్నాయని, ముఖ్యంగా యువకులు గుండె పోటుకు అధికంగా గురవుతున్నారని జిల్లా కలెక్టర్ డా ఏ.మల్లికార్జున అన్నారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్టెమీ ప్రాజెక్ట్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించిందని అన్నారు. సోమవారం ఉదయం కేజీహెచ్ లో జరిగిన ఏ పి స్టెమీ ప్రాజెక్ట్ శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 10 రోజుల పాటు వైద్యులు మరియు నర్సులు, పారామెడికల్ సిబ్బందికి స్టెమీ ప్రాజెక్ట్ శిక్షణ కార్యక్రమం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలను గుండె పోటు నుండి రక్షించి మరణాలను తగ్గించవచ్చని వివరించారు. సుదూర ప్రాంతాలలో, గ్రామీణ సెమీ అర్బన్ ప్రాంతాలలో ఈ.సీ.జీ చేయడం ద్వారా గుండెపోటును గుర్తించడానికి వైద్యులు శిక్షణ పొందుతారని, కార్డియాలజీ విభాగంలోని కార్డియాలజిస్ట్‌కు సమాచారం పంపడం ద్వారా వైద్యులు చికిత్సను సూచిస్తారన్నారు.

ఆ తర్వాత సీహెచ్‌సీ పీహెచ్‌సీ వైద్యులు గుండె రక్తనాళాల్లో క్లాట్ కరిగించే మందులు ఇంట్రావీనస్ ద్వారా ఇస్తారని, అడ్డంకులు తొలగిపోయి ఛాతీ నొప్పి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డా. బుచ్చిరాజు, డా.శివానంద, సూపరింటెండెంట్ కేజీహెచ్, డా. పద్మజ, డిప్యూటీ సూపరింటెండెంట్ కేజీహెచ్, డా .రాధాకృష్ణ, జనరల్ మెడిసిన్ ఏఎంసి, డీసీహెచ్ఎస్ రమేష్ కిషోర్, డా. ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్ అవకతవకలపై సీఐడీ విచారణ జరపాలి

మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: త్వరలోనే మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన అవినీతిపై టీడీపీ ఆధ్వర్యంలో చార్జీ షీటు కార్యాక్రమం నిర్వహిస్తామని మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. అనకాపల్లి జిల్లాలో జరిగిన ల్యాండ్ పూలింగ్‌లో జరిగిన అవకత వకలపై సిఐడి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రజలందరికీ భవిష్యత్తుకు గ్యారెంటీ, మహాశక్తి పథకాలను వివరించాలని కోరారు. ప్రతి నెల గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భవిష్యత్తుకు గ్యారెంటీ, మహా శక్తి, సమగ్ర ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. సమగ్ర ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియలో అలసత్వం వహిస్తే ఎన్నికల అధికారులకు పిర్యాదు చేయాలనీ తెలిపారు. నారా చంద్రబాబు నాయుడు పాలన కోసం ప్రజలందరూ ఎదురుచూస్తున్నారని అన్నారు. ఓట్లు అడిగే కనీస అర్హత జగన్ మోహన్ రెడ్డికి గానీ, మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు గాని లేదని ఆరోపించారు. వైకాపా పాలనలో వారి ఎమ్మెల్యేలు, మంత్రులూ, ఎంపిలు మాత్రమే అభివృద్ధి చెందారని అన్నారు. వైకాపా పాలనలో ఉత్తరాంధ్ర అభివృద్ధి 20ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందని ఆరోపించారు. జగన్ మోహన్ రెడ్డి నిరుద్యోగులకు చేసిన మోసాన్ని యువతకు వివరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ళ సురేంద్ర, కోట్ని బాలాజీ, మాధంశెట్టి నీల బాబు, కాయల మురళి, బి.జోగి నాయుడు, కొణతాల శ్రీనివాస రావు, బొద్దపు ప్రసాద్, పోలారపు త్రినాథ్, సబ్బవరపు గణేష్,శిరసపల్లి సన్యాసి రావు, ఉగ్గిన రమణ మూర్తి, గొంతిన శ్రీనివాసరావు, పచ్చికుర రాము, కొణతాల రత్న కుమారి, సేనాపతి స్వరూపా, తలారి కాశీ నాయుడు, సిద్ధి రెడ్డి శ్రీనివాసరావు, పెంటకోట రాము, దనల విష్ణు చౌదరి, సతీశ్ కుమార్, నాగేశ్వరరావు, బత్తుల రమేష్, తాతిల నాయుడు, తదితరుల పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌గా భూమన నియామకం భక్తుల్ని అవమానించడమే

విశాలాంధ్ర - సింహాచలం: టిటిడి చైర్మన్‌గా నియమించిన భూమన కరుణాకర్ రెడ్డి హిందువు కాదని, అతని పేరులోనే అన్యమతం పేరుతో ఉందని, ఒక అన్యమతస్తుడ్ని కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి దేవాలయానికి చైర్మన్‌గా ఎలా నియమిస్తారని విశ్వహిందూ పరిషత్ మందిర అర్చక పురోహిత రాష్ట్రా టోలి కన్వీనర్ పుడిపేద్ది శర్మ ప్రశ్నించారు. గతంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఇతన్నే నియమించి ఇదే తప్పుడు విధానాన్ని అవలంబించి ఆనాడు టీటీడీలో అన్యమతస్తుల్ని ఉద్యోగులుగా తీసుకోవడం జరిగిందని అన్నారు. ఆనాటి ప్రభావమే నేడు తిరుమల కొండల్లో అన్యమత ప్రచారం యదేచ్ఛగా జరుగుతుందని దానికి మూల కారణం ఆనాటి నేటి కరుణాకర్ రెడ్డి అని అతన్ని మరల వైయస్ జగన్ ప్రభుత్వంలో ఎలా చైర్మన్గా నియమిస్తారని అన్నారు. అతను మరలా టీటీడీ ఏడు కొండల్ని రెండు కొండలుగా మార్చే విధానం చేపడతాడని ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న వెంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీయటమేనని అన్నారు. టిటిడి చైర్మన్‌గా గతంలో ఒక అన్యమతస్తుడిని రెడ్డిని నియమించారని మరలా ఇప్పుడు రెడ్డినే నియమిస్తున్నారని రెడ్డిల సామాజిక వర్గం తప్పితే హిందువుల్లో ఏ సామాజిక వర్గం టిటిడి చైర్మన్‌గా వైయస్ జగన్ ప్రభుత్వంలో పనికిరారా అని ప్రశ్నించారు. గతంలో ఇదే కరుణాకర్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా పింక్ డైమండ్ మాయమైందని ఆనాడు తప్పుడు ప్రకటనలు ఇచ్చి ఇప్పటి ప్రతిపక్ష నేతపై అబద్ధాలు ప్రచారం చేశారని అన్నారు. మరి ఈరోజు ఏ మొహం పెట్టుకొని టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తారని,

పింక్ డైమండ్ గురించి జగన్ ప్రభుత్వం నేటివరకు ఎందుకు నోరు మెదప లేదని ఇప్పటికైనా జగన్ ప్రభుత్వం అన్యమతస్తుల్ని కాకుండా హిందూ సమాజంలో వెంకటేశ్వర స్వామి పట్ల విశ్వాసం ఉన్న వ్యక్తులని చైర్మన్గా నియమించాలని డిమాండ్ చేశారు.

పిల్లలందరి ముఖంలో సంతోషమే.. మా ఇంట ఆనందం

చేయూత వారియర్స్ ట్రస్ట్ సభ్యుడు మోద గిరి

విశాలాంధ్ర - చింతపల్లి: పిల్లలందరి ముఖంలో సంతోషమే మా ఇంట ఆనందమని చేయూత వారియర్స్ ట్రస్ట్ సభ్యుడు,మరియు కన్స్యూమర్ రైట్స్ అల్లూరి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఇమ్మంది మోదగిరి, గౌరీ దంపతులు అన్నారు. ఆ దంపతుల ద్వితీయ కుమారుడు తిషాన్ ముకేశ్ కుమార్ మొదటి జన్మదిన వేడుకలను ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో కాకుండా స్థానిక %ఖణా% క్వాటర్స్ లో ఉన్న వెనుకబడిన తరగతుల ఆశ్రమ వసతి గృహ పాఠశాల విద్యార్థుల మధ్య సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు 65 మంది పిల్లల మధ్యలో తమ బిడ్డ మొదటి జన్మదిన వేడుకలు నిర్వహించుకోవడం తమకెంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఆ ఆశ్రమ పాఠశాలలో ఉన్న విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత రోజులలో పుట్టినరోజు వేడుకలను, మేళ తాళాలతో, లైటింగులు, డీజే సౌండ్ ల మధ్య జరుపుకుంటున్న రోజుల్లో, మోదగిరి, గౌరీ దంపతులు తమ బిడ్డ జన్మదిన వేడుకలు తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్న ఆశ్రమ వసతి గృహ విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి నిర్వహించుకోవడమే గాక, చిన్నారులకు రుచికరమైన భోజనం పెట్టడం తమకు ఆనందమని మోదగిరి, గౌరీ దంపతులు ఆనందం వ్యక్తం చేశారు., ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నా బిడ్డ పుట్టినరోజును మా ఇంట్లో జరుపుకుంటే మేము, మా కుటుంబ సభ్యులమే ఆనందంగా ఉంటామని, అదే ఆశ్రమ వసతి గృహ పాఠశాలలో పిల్లలందరి సమక్షంలో నిర్వహించుకుంటే ఆ చిన్నారులతోపాటు తామంతా ఆనందంగా ఉంటామని చెప్పారు, ఈ కార్యక్రమంలో చేయూత వారియర్స్ ట్రస్ట్ సభ్యులు, దూనబోయిన రమణ, ఈరెల్లి రాజేష్, ఇందుగ శేఖర్, గుత్తుల లోవరాజు తదితరులు పాల్గొన్నారు

ప్రజలను నిండా ముంచేసిన వైసీపీ

టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్ధ వెంకన్న

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ప్రజలను వైసిపి నిట్ట నిలువునా ముంచేసిందని ఉత్తరాంధ్ర తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బుద్ధ వెంకన్న అన్నారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న వెంకన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను ఒక్కసారి అవకాశం ఇవ్వండి అని అడిగితే ఎంతో నమ్మకంతో జగన్ మోహన్ రెడ్డిని గెలిపిస్తే ఆయన ఈ రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచేసాడని అనేక ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడ్డాడని అన్నారు వైసీపీ ప్రభుత్వం వైఫల్యాలను చేస్తున్న అరాచకాలు విధ్వంసాలు ను నిరసనల ద్వారా ప్రజలకు తెలిసే విధంగా కార్యక్రమాలు చేయాలని అన్నారు మాజీ మంత్రి ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని అదే సందర్భంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు సైనికులు లాగ పని చేసి తద్వారా తెలుగుదేశం పార్టీ ఘన విజయానికి దోహదపడాలని అన్నారు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మంగళవారం వైసీపీ ప్రభుత్వం విశాఖపట్నంలో పాల్పడిన విధ్వంశాలు దబ్బులకి కక్కుర్తి పడి ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టడం వంటి అనేక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా చార్జిషీటు కార్యక్రమాన్ని జీవీఎంసీ గాంధీ విగ్రహం దగ్గర జరుగుతుందని ఆ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయడానికి కార్యకర్తలు అందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి, తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, శాసనమండలి సభ్యులు దువ్వవరపు రామారావు, వేపాడ చిరంజీవి, విశాఖ దక్షిణ నియోజక వర్గ ఇన్చార్జ్ గండి బాబ్జి, ఎస్ కోట కోళ్ల లలితకుమారి,

భీమిలి నియోజకవర్గం ఇంచార్జ్ కోరాడరాజబాబు, జీవీఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పాశర్లప్రసాద్, రాష్ట్ర పార్టీ నాయకులు కోళ్ల రాంప్రసాద్, వి ఎస్ఎన్ మూర్తి యాదవ్, బోండా జగన్,గంట నూకరాజు, లోడగలకృష్ణ, గొంపకృష్ణ కార్పొరేటర్లు గొలగని వీరారావు బుజ్జి,ముక్క శ్రావణి,గంధం శ్రీనివాసరావు, గొల్లగాని పోలా రావు దాడి రమేష్,బొమ్మిటి రమణ,పీవీ నరసింహ,మొల్లి ముత్యాలు,శరగడం రాజశేఖర్, మొల్లి లక్ష్మణరావు, పిల్ల వెంకటరావు, రాజమండ్రి నారాయణ,తదితరులు పాల్గొన్నారు

మగ్గం పట్టిన మహిళలకు మంచి రోజులు

విశాలాంధ్ర-ఆమదాలవలస: మగ్గం ఉన్న మహిళలకు ఇంకా మంచి రోజులు వస్తున్నాయని, గ్రామ సంఘం సభ్యులంతా ఐక్యంగా వాటిని సద్వినియో గపరుచు కోవాలని, వైయస్సార్ క్రాంతి పదం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మండల పరిధిలో గల శ్రీనివాసాచార్యుల పేట గ్రామ సంఘం ప్రెసిడెంట్ పి.సంధ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మగ్గానికి మళ్లీ మహర్దశ వచ్చిందని, మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. మునుపేన్నడు లేని విధంగా, చేనేత రంగానికి సంక్షేమాన్ని జోడించి ముఖ్యమంత్రి సొంత మగ్గం ఉన్న ప్రతి కుటుంబానికి ప్రతి ఏటా 24 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు వివరించారు. మన నియోజక వర్గంలో శాసన సభాపతి తమ్మినేని సీతారాం కృషి ఫలితంగా, చేనేత రంగంలో ఉన్న వారందరికీ, క్లస్టర్స్ ఏర్పాటు చేయించి అధునాతన శిక్షణల తో పాటు సబ్సిడీపై పరికరాలను ఇప్పించి నట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కో ఆర్డినేటర్లు సుభద్ర, రామప్పడు, చంద్రావు రమణల తో పాటు, సచివాలయ పరిధి లోగల వివో ఏలు సుశీల, లక్ష్మి, గ్రామ సంఘం ప్రతినిధులు వెంకటరత్నం, రోహిణి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : సంతబొమ్మాళి ఎంపీయూపీ మోడల్ పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సంతబొమ్మాళి గ్రామానికి చెందిన యువకులు కోరుతున్నారు. ఇటీవల కొద్ది రోజులుగా మూలపేట పోర్టుకు సంబంధించిన భారీ వాహనాలు తిరుగుతున్నాయని దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, స్పీడ్ బ్రేకర్లు పాడయ్యాయని ఏర్పాటు చేయాలన్నారు.

చంద్రబాబువి దిగజారుడు రాజకీయాలు

విశాలాంధ్ర-నరసన్నపేట : చిత్తూరు పోలీసులపై టిడిపి శ్రేణుల దాడి అత్యంత హేయమైనదని, రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు ఎంతటి నీచానికైనా దిగజారుతారనటానికి ఇదే నిదర్శనమని, వైసిపి జిల్లా అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. సోమవారం ఆయన పట్టణంలో ఆదివారపుపేట, బొంతల వీధి, సత్యన్నారాయణనగర్ కాలనీ, కామేశ్వరనగర్‌లో 145వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు పోలీసులపై దాడి అప్రజాస్వామ్యమని, దీనిని రాష్ట్రవ్యాప్తంగా వైసిపి శ్రేణులు తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. టిడిపి కార్యకర్తలు మొదట పోలీసులను చంపి, తద్వారా పోలీసు కాల్పులు జరిగేలా చూసి, ఆప్రమాదంలో ఎవరైనా మరణిస్తే తమ రాజకీయ లబ్ధికి వాడుకోవాలని చంద్రబాబు చూసారని, ఈ పరిస్థితిని రాష్ట్రమంతా గమనిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయితీ సర్పంచ్, బురల్లి శంకరరావు, ఎంపిపి, ఆరంగి మురళీధర్, వైసిపి ప్రతినిధులు, చింతు రామారావు, కెసిహెచ్.బి.గుప్తా, చీపురు కృష్ణమూర్తి, రాజాపు అప్పన్న, పొట్నూరు సాయిప్రసాద్, సురంగి నర్సింగరావు, బొబ్బాది ఈశ్వరరావు, పతివాడ గిరీశ్వరరావు, వైశ్యరాజు కేశవరాజు తదితరులు పాల్గొన్నారు.